క్లుప్తంగా

దోమతెరల పంపిణీ



గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేస్తున్న ఎస్టీఓ వెంకట పద్మనాభం, జె.సి.రాజు

రామభద్రపురం: కారుణ్య సంస్థ వ్యవస్థాపకుడు జె.సి.రాజు ఆధ్వర్యంలో నాయుడువలస గ్రామంలో 70 గిరిజన కుటుంబాలకు రూ.30 వేల విలువ చేసే దోమ తెరలు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన బొబ్బిలి ఎస్టీఓ వెంకట పద్మనాభం మాట్లాడుతూ సొంత లాభం కొంత మాని..పొరుగు వానికి తోడుపడవోయ్ అని చెప్పిన మహాకవి గురజాడ సందేశాన్ని కారుణ్య సంస్థ పాటిస్తోందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో దోమతెరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి రామరాజు,ఏఎన్ఎం భవానీ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందించేలా చర్యలు



మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలో గుర్తించిన కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఏఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 39 పంచాయతీల్లో 300 మంది కౌలు రైతులను గుర్తించామని, వీరిలో 175 మందికి సాగు హక్కుదారు పత్రాలు అందజేశామని చెప్పారు. బ్యాంకుబాట కార్యక్రమం ఏర్పాటు చేసి వీరికి ఖరీఫ్ పంట రుణాలను అందించేలా చర్యలు తీసుకుంటాన్నామని చెప్పారు. ఖరీఫ్ పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

విశ్వబ్రాహ్మణుల ఐక్యతకు కృషి



హారికాదేవికి కుట్టుమిషన్ అందజేస్తున్న స్వర్ణకార సంఘ సభ్యులు

రాజాం సిటీ: విశ్వబ్రాహ్మణుల ఐక్యతకు సంఘంలో ఉన్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వర్ణకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టేకు సత్యనారాయణ అన్నారు. రాజాంలో గురువారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణుల్లో పేద వారిని గుర్తించి వారికి చేదోడుగా నిలవాలని సభ్యులకు సూచించారు. పొగిరి గ్రామానికి చెందిన కల్లాడ హారికాదేవికి ఆర్థికసాయంతోపాటు జీవనోపాధి కోసం కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బంగారు దేవుడు, కార్యదర్శి తోలేటి సంతోష్, కె.నాగేశ్వరరావు, రాజాం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థిని సంధ్యారాణిని అభినందిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని లింగాలవలస ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని లాస సంధ్యారాణి జాతీయ ఉపకార వేతనానికి(ఎన్ఎంఎంఎస్)ఎంపికై ంది. విద్యార్థినిని ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు గురువారం అభినందించారు. పాఠశాల హెచ్ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



విద్యార్థుల వర్కుబుక్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు హెచ్ఎంలకు సూచించారు. పట్టణంలోని మెంతిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థుల హాజరుశాతం, ఉపాధ్యాయుల బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయుల సకాలంలో పాఠశాలకు హాజరు కావాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు.ఎంఈఓ వెంట హెచ్ఎం వీరస్వామి, జీఎంఆర్‌వీఎఫ్ వలంటీర్ పద్మావతి ఉన్నారు.

మూగ రోదన..!

- కబేళాలకు తరలిపోతున్న పశువులు
- వాహనాల్లో కుక్కి అక్రమ రవాణా
- కానరాని కనీస నిబంధనలు



రాజాం వారపు సంతలో వ్యాపారులు కొనుగోలుచేసిన పశువులు

రాజాం: మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. వ్యవసాయం, పాల ఉత్పత్తి కోసం పశువులను పెంచే వారు వాటి పోషణ భారం కావడం, యంత్రాలతో వ్యవసాయ పనులు జరుగుతుండడంతో పశువుల విక్రయాలు అధికమయ్యాయి. పశువులు ఒక రైతు నుంచి మరో రైతుకు కాకుండా వ్యాపారులు చేతిలోకి వెళుతున్నాయి. వీటిని ఆ వ్యాపారి జిల్లాలు, రాష్ట్రాలు దాటించి కబేళాలకు తరలించేస్తున్నాడు. దీంతో పశు సంపద ఏటా తగ్గుముఖం పడుతూ వస్తోంది. గతేడాది నాటికి జిల్లాలో పాడి పశువుల సంఖ్య 4,53,016 ఉండగా, ఇందులో 3,55,171 ఆవులు, 97,845 గేదెలు ఉండేవి. అయిదేళ్ల క్రితం ఒక్క రాజాం నియోజకవర్గంలోనే 3 లక్షల మేర పాడిపశుసంపద ఉండేది. ఈఏడాది జిల్లా వ్యాప్తంగా పశువుల సంఖ్య 3.60 లక్షలకు పడిపోయినట్లు పశుసంవర్ధక శాఖ పేర్కొంది. ఇటీవల కాలంలో కబేళాలకు తరలింపు అధికమవ్వడంతో పశు సంపద గణనీయంగా తగ్గిపోయింది.

రాజాం వారపు సంత కేంద్రంగా..

రాజాం పట్టణంలో మల్లికార్జున కాలనీ వద్ద ప్రతీ గురువారం వారపు సంత జరుగుతుంది. ఇక్కడ వారానికి 400 నుంచి 500 వరకు పశువుల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. కొనుగోలు చేసిన పశువులను వ్యాపారులు ఇక్కడే గ్రేడింగ్ చేస్తారు. అనారోగ్యంగా ఉన్న వాటిని ఇక్కడే స్థానికంగా కొన్ని ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌కు విక్రయాలు చేస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్నవాటిని దక్షిణాది రాష్ట్రాలకు వివిధ పోర్టుల ద్వారా తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇవి విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. తనిఖీ అధికారులకు ఎటువంటి అనుమానం రాకుండా ఉండేందుకు బొలెరో వంటి వాహనాల్లో వీటిని ఎక్కించి, చుట్టూ తలుపులతో, పైన టార్పాలిన్‌లతో కప్పేస్తున్నారు. రెండు నుంచి మూడు పశువులు మాత్రమే పట్టే వాహనాల్లో 15 నుంచి 20 వరకు కుక్కి ఎక్కించి తరలించేస్తున్నారు.



బొలేరో వాహనాల్లో పశువుల తరలింపు



వాహనాల్లోకి పశువులు ఎక్కిస్తున్న దృశ్యం

గోప్యంగా..

పశుమాంసానికి కొన్ని దేశాల్లో విపరీతమైన గిరాకీ ఉంది. అక్కడ ఎటువంటి ఆంక్షలు ఉండవు. స్థానికంగా కిలో పశుమాంసం రూ. 400 వరకు విక్రయిస్తుంటే.. ఇతర దేశాల్లో రూ.5వేల వరకు ఉంటుందని సమాచారం.ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాకు చెందిన వ్యాపారులు పశువులను వధించి, పోర్టులు, ఇతరాత్ర మార్గాలు ద్వారా విదేశాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన కొనుగోలుదారుని వివరాలు బయటకు రావు. రాజాం వారపు సంతలో రైతుల మాదిరిగా వ్యాపారులు పశువులను కొనుగోలుచేసి వాహనాల ద్వారా తరలించేస్తున్నారు. ఇదంతా గోప్యంగా జరిగిపోతోంది.

దృష్టిసారిస్తాం

పశువుల అక్రమ రవాణా నియంత్రణపై దృష్టిసారిస్తాం. రైతులు కొనుగోలు వరకు పర్వాలేదు. వ్యాపారులు ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించకుండా చర్యలు తీసుకుంటాం. ఇక్కడ ఎటువంటి ఫిర్యాదులు లేకపోవడంతో పట్టించుకోవడంలేదు. ఎవరైనా ఫిర్యాదుచేస్తే కొనుగోలుదారులపై చర్యలు తీసుకునేలా దృష్టిసారిస్తాం.

– కె.అశోక్‌కుమార్, రాజాం పట్టణ సీఐ

నిఘా తగ్గిందా..

పశువుల తరలింపు విషయంలో రైతులు కూడా నిబంధనలు పాటించాల్సి ఉంది. వారపు సంతలో పశువులను విక్రయించే ప్రాంతాల వద్ద తాగునీటి వసతులు, వాహనాలు ఎక్కించి, దించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. వాహనాన్ని బట్టి పశువులను ఎక్కించాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు మించి పశువులను కిక్కిరిసి ఎక్కిస్తున్నారు. ఇక్కడి వారపు సంతలో పశువులు తాగేందుకు ఎక్కడా ఒక్కచుక్క నీరు కూడా కనిపించదు. తనిఖీలు చేయాల్సిన పోలీసులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం, అక్రమ తరలింపును అడ్డుకోకపోవడంతో ఇక్కడి నుంచే వ్యాపారం అధికంగా సాగుతోంది. మున్సిపల్ అధికారులు మామ్మూళ్ల మత్తులో ఉండడంతో సంత వద్ద ప్రమాదకర వ్యాపారం సజావుగా సాగిపోతోంది. కనీస వసతులపై వ్యాపారులను, సంత నిర్వాహకులను ప్రశ్నించే అధికారి ఎవ్వరూ ఇక్కడ కనిపించకపోవడం శోచనీయం.

అటకెక్కిన కూటమి ఎన్నికల హామీలు



ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్‌లకు హారతులు పడుతున్న తాటిపాడు గ్రామ మహిళలు

- కూటమి ఏడాది పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి శూన్యం
- 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్

రేగిడి: ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు ఎప్పటికప్పుడు మోసపోతూనే ఉన్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహనరావు అధ్యక్షతన తాటిపాడు గ్రామంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్ అతిథులుగా హాజరయ్యారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజల నోట్లో మట్టి కొట్టిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలన్నీ అటకెక్కించేశారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే చేసేశామని సీఎం చంద్రబాబు చెబుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. హామీలను నెరవేర్చకపోవడంతో టీడీపీ కూటమి నాయకులు గ్రామాల్లో తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు. హామీలను అమలు చేయ కుండా చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ఇంటింటికీ వివరించాలని వైఎస్సార్‌పీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ ప్రభుత్వానికి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంలో ఉన్న శ్రద్ధ సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని, పాలన గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష్యసాధింపులకు పాల్పడడమే పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమ న్నారు.

హారతులతో స్వాగతం పలికిన మహిళలు

వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం అనంతరం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాటిపాడు గ్రామంలో పర్యటించారు. వీరికి స్థానిక మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. యువకులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కెంబూరు వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు కరణం శ్రీనివాసరావు, పార్టీ నియోజకవర్గ మేధావుల వర్గం అధ్యక్షుడు కెల్ల మన్మథరావు, సర్పంచ్‌లు వావిలపల్లి శశిభూషణరావు, టంకాల ఉమాపాపినాయుడు, పాడి లక్ష్మునాయుడు, లెంక రాంబాబు, గార రమణ, పి.బాబూరావునాయుడు, కరణం గోవిందరావు, చుక్క వెంకటనాయుడు, సవలాపురపు నర్సిం అప్పారావు, పి. కృష్ణవేణి, ఎంపీటీసీలు కింజరాపు సురేష్, ఎర్నేన అప్పలనాయుడు, పొగిరి అప్పలనాయుడు, పిల్లా రోజ, మాజీ సర్పంచ్ పి. రామినాయుడు, కో–ఆప్షన్ మెంబర్ షేక్‌సలీం, గాదం గోవిందరావు, గాదం సింహాచలం పాల్గొన్నారు.

చంద్రబాబుకు అధికారమే పరమావధి



చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అధికారమే పరమావధిగా చంద్రబాబు అండ్- కో ఎన్నికల్లో వందల హామీలు ఇచ్చారని, తీరా గద్దెనెక్కాక వాటిని గాలికి వదిలేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి ఇన్‌చార్జి శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శంబంగి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని, పాఠశాల ఖర్చులకోసం మినహాయించుకోబోమని చంద్రబాబునాయుడు చెప్పారని, ఇప్పుడు రూ.8 వేల నుంచి 9 వేలు మాత్రమే జమ చేస్తున్నారని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా నేటికీ రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులు జమ కాలేదన్నారు. ఆడబిడ్డ నిధి పేరిట 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారని, ఏ ఒక్కరికైనా ఇచ్చారా అని స్థానిక మహిళలనుప్రశ్నించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోగా ప్రజల నడ్డి విరిగేలా విద్యుత్ ఛార్జీల భారం మోపిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు.

చంద్రబాబు వారసులే వీళ్లంతా!

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను, తోటి పార్టీ నాయకులకు మోసం చేసిన చంద్రబాబునాయుడు బాటలోనే స్థానిక నాయకులు పయని స్తున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎలాగైతే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారో, స్థానిక నాయకులు కూడా అలాగే ప్రజలకు హామీలిచ్చి అమలుచేయడం లేదన్నారు. అంతే కాదు ప్రజలను ఏమార్చడంలో ఏమాత్రం వెనుకంజ వేయరన్నారు. ప్రజలంతా గమనించి ఎవరు ప్రజల సంక్షేమం కోసం పాటు పడ్డారు..? ఎవరు స్వలాభాల కోసం పరిపాలిస్తున్నారన్న విషయాలు బేరీజు వేసుకోవాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీ కృష్ణారావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, నాలుగో వార్డు ఇన్‌చార్జి కె.వేణుగోపాల్,మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు),వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరా కోసం ఆర్డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆరికతోట, బూసాయవలస, మామిడివలస, పాడివానివలస, ఎస్.చింతలవలస, మర్రివలస, పాలవలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే ఆరికతోట సబ్ స్టేషన్ పరిధిలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ పనులు చేపడుతుండడం వల్ల ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాతరేగ, కొత్తరేగ, దుప్పలపూడి, ఆరికతోట, ఎనుబరువు, ఆర్.చింతలవలస, కొండకెంగువ, చొదంతివలస తదితర గ్రామాలకు, అలాగే 11 కేవీ రామభద్రపురం ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో రామభద్రపురం టౌన్‌కు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు



మద్దువలస జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షేక్ శంకర్

వంగర: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ షేక్ శంకర్ సూచించారు. మద్దువలసలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో గురువారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై సంకల్ప రథంలోని ఎల్ఈడీ స్క్రీన్‌పై వీడియోలు ప్రదర్శించారు. సైబర్ నేరాలు,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాళ్లు కోట రవిశంకర్, జంపా రాధిక, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి తిరువీధి



రాజాం: రాజాం పట్టణంలో చౌడేశ్వరీదేవి తిరువీధి



వంగర: కొప్పరలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని సంతమార్కెట్‌లో వెలసిన కల్యాణగౌరీ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకులు హరవిల్లి హరనాథశర్మ ఆధ్వర్యంలో పూజలు , అభి షేకాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తికి తిరువీధి నిర్వహించారు. సాయంత్రం కోలాటం ప్రదర్శన ఏర్పాటు చేశారు. మహిళలు లలితా పారాయణం, సహస్రదీపాలంకరణ చేశారు. కల్యాణగౌరీ మల్లికార్జున దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొప్పరలో సామూహిక పూజలు

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో దేవాంగుల కులదేవత చౌడేశ్వరీదేవి అమ్మవారి ఉత్సవాలు గురువారం నిర్వ హిం చారు. పండితులు భోగాపురపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో గ్రామంలో ఒక వేదిక ఏర్పాటు చేసి చౌడేశ్వరీదేవి అమ్మవారి చిత్రపటానికి దేవాంగ కుల మహిళలంతా కుంకుమ పూజలు చేశారు. అనతరం అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగించారు. ఈసందర్భంగా అలాగే నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా అయ్యంకి జయంతి

గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రంథాలయ అధికారులు స్వర్ణలత, ఆర్.దుర్గాప్రసాద్, సీహెచ్.కృష్ణమూర్తి పాఠకులు, విద్యార్థులతో కలిసి అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఏర్పాటు, వాటి అభివృద్ధికి అయ్యంకి చేసిన సేవలు మరువలేనివని లైబ్రేరియన్‌లు అన్నారు.

– బొబ్బిలి/బాడంగి/తెర్లాం



బొబ్బిలిలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు



తెర్లాంలో అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్, నివాళులర్పిస్తున్న విద్యార్థులు



బాడంగిలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్,పాఠకులు

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

బొబ్బిలిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు వ్యాధులకు దూ రంగా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. చింతాడ పంచాయతీ పరిధి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు చేపడుతున్న చెత్త సేకరణ పరిశీలించారు. తాగునీటి వనరుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, గ్రామాల్లో చెత్తవేస్తున్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పారిశుద్ధ్య సమస్యలపై ప్రజలనుంచి ఫిర్యాదులొస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎంపీడీఓ వెంట గ్రామ సర్పంచ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు

వంగర: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి హెచ్చరించారు. ఎం.సీతారాంపురంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రీన్ అంబాసిడర్ ఇంటింటి నుంచి చేపడుతున్న చెత్తసేకరణ పరిశీలించారు.గ్రామంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తను ఆరుబయట, కాలువల్లో పారబోయకుండా ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్‌కు అందించాలని ప్రజలకు సూచించారు. అలాగే రక్షిత మంచినీటి పథకం క్లోరినేషన్ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన

రాజాం సిటీ: సోపేరు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. వేరుచేసిన చెత్తను పిట్‌లో వేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలని దిశా నిర్దేశం చేశారు.

సాగునీటి వనరుల గణనపై శిక్షణ

తెర్లాం: మండలంలోని సాగునీటి వనరుల గణనపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వీఆర్ఓలకు తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో డిప్యూటీ గణాంకాధికారి ఎం.భానుమూర్తి, మండల ఏఎస్ఓ యు.సురేష్ గురువారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని మైనర్ ఇరిగేషన్ వనరుల గణనను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ గణాంకాధికారి ఎం.భానుమూర్తి మాట్లాడుతూ మండలంలోని మైనర్ ఇరిగేషన్ వనరులన్నింటినీ ఈ గణనలో చేర్చాలన్నారు. గణన చేసేటప్పుడు ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ గణనకు సూపర్‌వైజర్లుగా మండల ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణ, మండల ఏఎస్ఓ యు.సురేష్, ఎంఆర్ఐ కృష్ణమూర్తి వ్యవహరించనున్నారు.

జాషువా వర్ధంతి సభను జయప్రదం చేయండి

బొబ్బిలి: పట్టణంలోని ట్రిపుల్ఎస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మహాకవి గుర్రం జాషువా వర్ధంతి సభను నిర్వహించనున్నట్టు అంబేద్కర్ సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పద్మభూషణ్, విశ్వకవి గుర్రం జాషువా తన రచనలతో సమాజాన్ని జాగృతం చేశారన్నారు. ఈసందర్భంగా ఆయనను స్మరించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, ఆరోజు ఉదయం పదిన్నర గంటలకు జరిగే సభకు సాహిత్యాభిమానులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టైలరింగ్ శిక్షణ పరిశీలన



శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: పట్టణంలోని కొండంపేట సమీపంలో మండలంలోని మహిళలకు ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఇస్తున్న కుట్టు మిషన్ శిక్షణను ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు.శిక్షణను సద్వినియోగించుకోవాలని మహిళలకు సూచించారు. 90రోజుల శిక్షణను పూర్తి చేసుకున్నవారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని చెప్పారు.